నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 8 జనవరి 2025 | NAGARKURNOOL

ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటిమట్టం

ఆర్డీఎస్‌లో తగ్గుతున్న నీటినిల్వ

- నేడు టీబీ డ్యాం నుంచి రెండోవిడుత ఇండెంట్
- ఈనెల 8నుంచి 17వరకు 1.04 టీఎంసీలు విడుదల
- ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు

అయిజ, జనవరి 7: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటినిల్వ క్రమేపీ తగ్గిపోతున్నది. తుంగభద్ర జలాశయం నుంచి ఆర్డీఎస్‌కు నీటి విడుదల పూర్తిగా నిలిచిపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. మంగళవారం ఆర్డీఎస్‌కు 285 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 215 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 95క్యూసెక్కులు ఆర్డీఎస్ స్లూయిస్ గుండా దిగువకు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 5.9 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 17వరకు టీబీ డ్యాం నుంచి రెండో విడుత ఇండెంట్‌లో భాగంగా 1.04 టీఎంసీ నీటిని పది రోజులపాటు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. మొదటి ఐదు రోజులు 1500 క్యూసెక్కులు, చివరి ఐదు రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ నాటికి ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుందని పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

టీబీ డ్యాంలో నీటినిల్వ

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా.., అవుట్‌ఫ్లో 8,091 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 76.320 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికిగానూ, ప్రస్తుతం 1,624.95 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

హెల్మెట్ పెట్టుకొని వాహనాలు నడిపే వారిని పూలతో అభినందిస్తున్న అధికారులు

- వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్
- హెల్మెట్, కారు సీట్‌బెల్టు పెట్టుకొని వాహనాలు నడిపే వారికి పూలతో అభినందనలు

వనపర్తి టౌన్, జనవరి 7: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్రాణాలను రక్షించుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో హెల్మెట్ పెట్టుకొని బైక్ నడిపే వారిని, సీట్‌బెల్ట్‌తో కార్ నడుపుతున్న వారిని జిల్లా రోడ్డు రవాణా అధికారి మానస, పోలీస్ సిబ్బందితో కలిసి వాహన దారులకు పూలు ఇస్తూ అభినందించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తన ప్రాణం తోపాటు ఇతరుల ప్రాణాన్ని రక్షించేందుకు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరైతే నిబంధనలు పాటించడం లేదో అలాంటి వారికి జరిమానాలు విధించాలని రోడ్డు రవాణా అధికారిని ఆదేశించారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సునంది దేవి, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ డ్డి, బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, ఐటీఐ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

రెప్పపాటులో..

- ఓవర్‌టేక్ చేయబోయి టిప్పర్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి, నలుగురి పరిస్థితి విషమం
- కారులో ఇరుక్కొని డ్రైవర్ నరకయాతన
- దేవరకద్ర మండలం పెద్దగోప్లాపూర్ వద్ద ఘటన

దేవరకద్ర, జనవరి 7: మండలంలోని పెద్ద గోప్లాపూర్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఇద్దరు మృతిచెందినట్లు ఎస్సై నాగన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబుబ్‌నగర్ నుంచి మరికల్ వైపు వెళ్తున్న కర్ణాటకు చెందిన ఎర్టిగా కారు రోడ్డుపై మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయ బోయి శక్తినగర్ నుంచి బొగ్గులోడ్‌తో హైదరాబాద్‌వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో కారులో ఉన్న ఆరు గురికి గాయాలు కాగా.. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టిపర్‌లో ఇరుక్కుపోయిన కారును జేసీబీ సహాయంతో బయటికి తీసి అందులో ఉన్న ఆరు గురిలో నలుగురిని 108లో జిల్లా దవాఖానకు తరలించారు. కారు డ్రైవర్ సీటులోనే ఇరుకుపోవడంతో జేసీబీతో బయటికి తీశారు. దవాఖానకు తరలించిన వారిలో చికిత్సపొందుతూ ఇద్దరు మృతిచెందారు. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకోవడంతో ఇరువైపులా దాదాపు కిలో మీటర్ మేర వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

శాంతినగర్‌లో వ్యాపారీ కిడ్నాప్

వడ్డేపల్లి, జనవరి 7: మున్సిపాలిటీ కేంద్ర వైశ్య శాంతినగర్‌లో వ్యాపారి కిడ్నాప్‌కు గురైన ఘటన చోటుచేసుకున్నది. శాంతినగర్‌కు చెందిన రవి బాబు(42)ను అతను బాకీ ఇచ్చిన వ్యక్తి పేరు చెప్పి, బాకీ చెల్లిస్తామని ఆశ చూపి హైదరాబాద్ బాచ్ బండ్ల గూడకు పిలిపించారు. అక్కడ ఒక అపార్ట్‌మెంట్‌లో అతన్ని బంధించారు. నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి అతన్ని కట్టేసి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హింసించారు. డబ్బుల కోసం అతనితో ఒక వ్యక్తికి ఫోన్ చేయించారు. కిడ్నాప్‌కు గురైన వ్యక్తి భార్య సుభాషిణికి విషయం తెలిసి వెంటనే శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై సంతోష్ కేసు నమోదు చేశారు. ఫోన్ ద్వారా అతని ఆచూకీ గుర్తించారు. కిడ్నాప్‌కు గురైన రవిబాబును క్షేమంగా ఇంటికి వచ్చేందుకు కృషి చేశారు.

మోసం.. కాంగ్రెస్ నైజం

- హామీ మేరకు రైతుభరోసా అందించాలి
- 'పాలమూరు'కు జైపాల్‌రెడ్డి పేరెందుకు..
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, జనవరి 7: మోసం కాంగ్రెస్ నైజమని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టుకు దివంగత నేత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరు ఏ విధంగా పెడుతారని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతు బంధు పథకంపై కాంగ్రెస్ మాట మార్చిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం మక్తల్ పట్టణాధ్యక్షుడు చిన్న హనుమంతు అధ్యక్షతన మక్తల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ.. ఎడారిగా ఉన్న టువంటి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలు పచ్చటి పంటపొలాలతో కళకళలాడాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మిస్తే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టుకు దివంగత నేత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెడుతామనడం సిగ్గుచేటన్నారు. కేంద్రమంత్రిగా ఉండి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయకుండా.. తనను అభివృద్ధిని చేసుకున్న జైపాల్‌రెడ్డి పేరును ఏ విధంగా పెడుతారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా అందిస్తామని ఆశ చూపి.. అధికారంలోకి వచ్చాక కేవలం రూ.12 వేలే ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గు లేకుండా ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అన్నీ కటింగులు పెడుతూ నిర్వీర్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతు భరోసా రూ.12వేలు అందిస్తామని ప్రకటనలు చేయడం చూస్తే వ్యవసాయంపై ఎంత మక్కువ ఉందో అర్థమవుతుందన్నారు. వానకాలంలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోయిందని విమర్శించారు. దీంతో రైతులు కర్ణాటకకు తరలించి అమ్ముకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఉన్న సమయంలో చివరి గింజను సైతం కొనుగోలు చేశామన్నారు. పంట పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలకు తగ్గకుండా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యతు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ తాసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మండలాధ్యక్షుడు మైపాల్ రెడ్డి, ఆసిరెడ్డి, కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, అన్వర్, నాయకులు శంకర్, కుర్మయ్య, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, మహమూద్, సాధిక్, అశోక్‌గౌడ్, ఆనంద్, నర్సింహులు, శివారెడ్డి, సాగర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మక్తల్‌లో బీఆర్ఎస్ నేతల బైక్ ర్యాలీ

తిమ్మాజిపేటలో బీఆర్ఎస్ నేతల నిరసన

పెద్దమందడి మండలం మద్దిగట్ల శివారులో పొలంలో నిరసన తెలియజేస్తున్న కూలీలు, బీఆర్ఎస్ నేతలు

భరోసా మోసంపై భగ్గుభగ్గు

- ఉమ్మడి జిల్లాలో ఆగ్రహజ్వాల
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మిన్నంటిన ఆందోళన
- పెద్దమందడి మండలం మద్దిగట్ల శివారులో పొలంలో వ్యవసాయ కూలీలు, నేతల నిరసన
- మక్తల్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం
- గులాబీ పార్టీ నేతల బైక్ ర్యాలీ
- రైతుభరోసా ఎకరాకూ రూ.15 వేలు అందించాలని డిమాండ్

మక్తల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన చిట్టెం, నాయకులు

రైతు భరోసా సాయంపై మాట మార్చిన ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. మంగళవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు చోట్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రోడ్లపైకి చేరుకొని బైఠాయించారు. వీరికి రైతులు మద్దతు పలికారు. వనపర్తి జిల్లా మద్దిగట్లలో రైతులు, కూలీలు పంట పొలంలో నాయకులతో కలిసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి భగ్గుమన్నారు. మక్తల్‌లో నల్ల జెండాలతో గులాబీ నేతలు పాల్గొనగా.. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక నేతలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా సాయం ఎకరాకూ రూ.15 వేలు అందిస్తానని చెప్పి.. అధికారంలోకి వచ్చాక రూ.12 వేలు ఇస్తామనడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను దగా చేయడం మానుకొని వెంటనే ఇస్తానన్న పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 7

కుంటిసాకులుమాని రాజీనామా చేయండి

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి మీకు ముందే తెలియదా..?
- హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేలు రైతుభరోసా ఇవ్వాల్సిందే..
- రైతు జేఏసీ నాయకులు
- రుణమాఫీ కాని రైతు జాబితా సేకరణలో ..

కల్వకుర్తి మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

కల్వకుర్తి, జనవరి 7: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతూ.. రోజుకొక రాగం తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ తప్పులను ఒప్పుకొని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామాకు సిద్ధమని ప్రకటించాలన్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి గ్రామాలవారీగా జాబితా సేకరించడంలో భాగంగా మంగళవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకుడు రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రుణమాఫీ 50శాతానికి మించలేదని, ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం రుణమాఫీ విషయంలో పొంతన లేకుండా సమాధానాలు ఇస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ కోసం గ్రామాల్లో రైతులు ఎదురుచూస్తున్నారని, పంట రుణం కలిగిన ప్రతిరైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ తగిన ప్రతిఫలం అనుభవిస్తుందని హెచ్చరించారు. రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నూటొక్క రాగం తీసి ఏదో పాటపాడినట్లు.. ఏడాది కాలంగా కమిటీ అంటూ కాలయాపన చేసి చివరకు ఎకరాకు రూ.12వేలు ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారం వచ్చాక కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఏడాదిగా కాలయాపన చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రకారకాల లీక్‌లు ఇస్తూ రైతాంగాన్ని అయోమయానికి గురిచేశారని, రైతుల ఉసురు కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా తగులుతుందని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఏడాది దాటిందని, రైతు రుణాలకు సంబంధించి ఏడాదిగా వడ్డీని కూడా ప్రభుత్వమే భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. ఇవేవి ఇవ్వకుంటే.. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో హామీలు అమలు చేయడంలో విఫలం చెందాం.., తప్పయిపోయిందని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సరైన పాలన అందిస్తామని చెప్పి తిరిగి ఎన్నికలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు యాదగిరి డ్డి, కృష్ణగౌడ్, తిరుపతి డ్డితోపాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆలోచనలతోనే ఆవిష్కరణల పుట్టుక

- విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి
- వైద్య, విద్యా రంగాలకు అత్యంత ప్రాధాన్యం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జడ్చర్లలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన షురూ..

మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

జడ్చర్ల, జనవరి 7 : కొత్త కొత్త ఆలోచనలతోనే వినూత్న ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వీటిని గుర్తించి ప్రోత్సహించేది తల్లిదండ్రులతోపాటు గురువులేనన్నారు. పిల్లల్లో టాలెంట్‌ను గుర్తించేది వారే అని తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన 861 ప్రదర్శనలు వచ్చినట్లు వివరించారు. ప్రదర్శనలను మంత్రి తిలకించి వారి ఆవిష్కరణల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో పోటీతత్వం ఉండాలని, ఆలోచన, ఆచరణ, అన్వేషణ మూడు ముఖ్య వైఖరని, విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టి జాతీయస్థాయిలో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రతిఒక్క విద్యార్థిని, విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ఆవిష్కరణలు తనను ఎంతో అబ్బురపరిచాయన్నారు. ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రతి పాఠశాలలోనూ సైన్స్ ప్రయోగశాలలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖడైరెక్టర్ నర్సింహారెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ పాఠశాలలో ప్రయోగశాలలు ఉండాలని అన్నారు. ప్రదర్శనలు తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్‌తోపాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


టీఎల్ఎం ప్రదర్శన ఇస్తున్న నల్లగొండ విద్యార్థులు

లోకాస్ట్ ప్రీకాస్టు 'టీఎల్ఎం'- విత్ వర్కింగ్ మోడళ్లు..

విద్యార్థులకు పాఠ్యాంశాలలో బోధన చెప్పడంతోపాటు బోర్డుపై బొమ్మలు గీసి పాఠ్యాంశాలు చెబితే అంతగా గుర్తుండదని.. అయితే వాటిని బోధనోపకరాణాల(టీఎల్ఎం- టీచర్ లెర్నింగ్ మెటీరియల్స్)ను చూపించి చెప్పడంతో అర్థవంతంగా ఉంటుందని నల్లగొండలోని చర్లపల్లి డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చాత్రోపాధ్యాయులు అన్నమ్మ, మౌనిక, గైడ్ బొడ్డుపల్లి రామకృష్ణ వెల్లడించారు. వాస్తవికమైన విషయాలను విద్యార్థుల కండ్ల ముందు ఉంచి పాఠ్యాంశాలు చెబితే నిజజీవితంలో ఎక్కువ రోజులు గుర్తుంటుందన్నారు. లోకాస్టు టీఎల్ఎం - విత్ వర్కింగ్ మోడల్స్' అనే అంశాలను వెస్ట్ మెటీరియల్స్ ఉపయోగించి చేశారు. అదే విధంగా చెక్కలు- బోల్ట్‌లతో సూక్ష్మదర్శిణి చేసి మొబైల్‌తో వాటిని వీక్షించి చిత్రాలను ఫొటోలు తీసుకునే దానిని తయారు చేశారు. అదేవిధంగా సిగరేట్, బీడి, చుట్ట తాగడంతో ఊపిరితిత్తులు చెడిపోయే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి స్ఫూర్తి నింపారు. అంతేకాకుండా వివిధ టీఎల్ఎంతో ప్రదర్శనలో అవగాహన కల్పించారు.

ప్రమాదాల నియంత్రణకు..

హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సంగారెడ్డి విద్యార్థినులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు అనేక రకాలుగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్నా.. నిత్యం ఏదో ఒక చోట వాహన దారులు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. వీటి నియంత్రణకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం జెడ్పీహెచ్‌ఎస్ 9వ తరగతి విద్యార్థినులు తేజస్విని, మహేశ్వరి 'స్మార్ట్ హెల్మెట్' రూపొందించారు. బైక్‌కు దీన్ని అనుసంధానించడంతో ఈ హెల్మెట్ పెట్టుకుంటేనే వాహనం స్టార్ట్ అవుతుంది. ఆల్కహాల్ డిటెక్టర్, జీపీఎస్ సిస్టం, వైఫర్, ఫ్యాన్, ఇండికేటర్ లైట్స్ స్మార్ట్ హెల్మెట్‌కు ఉంటాయి. మద్యం సేవించిన వారు బైక్ నడపాలని అనుకున్నా వాహనం స్టార్ట్ కాదు. ఏదైనా అనుకోని ప్రమాదం బారిన పడితే మనం ఎక్కడ ప్రమాదానికి గురయ్యామనే విషయాలను జీపీఎస్‌తో కుటుంబ సభ్యులు గుర్తిస్తారు. హెల్మెట్ పెట్టుకుంటే ఉక్కపోత అనేమాటే ఉండకుండా అందులోనే ఫ్యాన్‌ను అమర్చారు. గైడ్ టీచర్ శోభారాణి పర్యవేక్షణలో దీన్ని రూపొందించారు.